క్లుప్తంగా

వసతి గృహం తనిఖీ..



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కూసుమంచి: కూసుమంచిలోని బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ రాంచందర్‌రావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, నిత్యావసర సామగ్రి నాణ్యతతో పాటు మెనూ పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంక్షేమాధికారికి సూచించారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన...

వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని కూసుమంచిలోని గంగాదేవీ చెరువు వద్ద ఏర్పాట్లను గ్రామ కార్యదర్శి నీరజతో కలిసి ఎంపీడీఓ రాంచందర్‌రావు కలిసి పరిశీలించారు.

ఎగ్జిబిషన్‌కు ఆదరణ



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శన కళాసిల్క్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది.. ఈ మేరకు వివిధ రకాల చీరలు, గృహోపకరణ వస్తువులు, దుస్తులు అందరికీ అందుబాటు ధరలో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మేళా కొన్ని రోజులు మాత్రమే ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వినోద్ జైన్ తెలిపారు.

పేపర్‌బాయ్స్‌కు సత్కారం

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచ పేపర్‌బాయ్స్ దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని త్రీటౌన్ రాఘవ మహల్ రోడ్‌లో వాసవీ క్లబ్ కార్యాలయంలో పలువురు పేపర్ బాయ్స్‌కు క్లబ్ ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఖమ్మం నగర అధ్యక్షులు పసుమర్తి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, ప్రతినిధులు గుంటుపల్లి దివాకర్ గుప్తా, కృష్ణమోహన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంకు మేనేజర్‌కు..

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని టీజీబీవీలో సేవలు అందించి బదిలీపై వెళ్తున్న బ్యాంకు మేనేజర్ అన్వేష్‌ను గురువారం బ్యాంకు సిబ్బంది, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ వేణుగోపాల్, నాయకులు కొమ్ము శ్రీను, ముత్తయ్య, ఉమేష్, నాగేశ్వరరావు, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

క్వారీలో ఇనుప రాడ్లు చోరీ

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు సమీపాన ఓంసాయి గ్రానైట్ క్వారీలో ఇనుప రాడ్లు చోరీ అయ్యాయి. రూ.లక్ష విలువైన డ్రిల్లింగ్ పెట్టె, ఏడు రాడ్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని క్వారీ నిర్వాహకుడు రఘురాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఘాటి
వినోద	కొత్తలోక,
	మహావతార్ నర్సింహా
సాయిరాం	మదరాసి
ఆదిత్య	ద కంజురింగ్: లాస్ట్‌రైట్స్
శ్రీనివాస	లిటిల్‌హార్ట్స్, వార్ 2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	50		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	60		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	50	తోటకూర	4
దొండ	38		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	40		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

ధరహాసం వచ్చేనా..?

మిర్చి ధరపై రైతుల ఎదురుచూపులు

● గతేడాది అనుభవంతో తగ్గిన సాగు విస్తీర్ణం



నర్సరీలో సిద్ధంగా నారు



మిర్చి మొక్కలు నాటుతున్న కూలీలు

తిరుమలాయపాలెం: ఒకప్పుడు సిరులు కురిపించిన మిర్చిని సాగుచేయాలంటేనే బెంబేలెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది తెగుళ్లు, మార్కెట్ ధరలు లేక పెట్టుబడులు భారీగా పెరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధర వస్తుందనే ఆశతో ఏసీ గోదాముల్లో నిల్వ చేసుకున్న పంటకు కూడా నేటికి గిట్టుబాటు ధరలు రాకపోవడంతో మిర్చి సాగుకి రైతులు విముఖత చూపుతున్నారు.

పత్తిసాగుపై మొగ్గు..

మండలంలో గతేడాది 10 వేల ఎకరాల్లో చేపట్టగా ఈ ఏడాది 4 వేల ఎకరాలలోపే సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. భారీగా పెట్టుబడులు పెట్టి సాగుచేసే సాగుతో అప్పుల పాలైన రైతులు పత్తి సాగుకి మొగ్గుచూపారు. ఈ ఏడాది మండలంలోని 19వేల ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. పత్తి పంట అనంతరం మొక్కజొన్న సాగు చేయాలనే ఆలోచనలో రైతులున్నారు. ఇటీవల మార్కెట్‌లో మిర్చి రూ.15 వేలకు పైగా ధర పలుకుతుండడంతో కొందరు రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. నర్సరీల్లో మిర్చి నారు కొనుగోలు చేస్తూ మిర్చి పంటను సాగుచేస్తున్నారు.

చీడపీడలతో తీవ్ర నష్టం..

మిర్చి సాగులో ప్రారంభ దశలో బాగానే ఉన్నా పంట పూత కాత దశలో విల్ట్ (ఎండుతెగులు) తెగులుతో మొక్కలు ఎండిపోవడం, నవంబర్, డిసెంబర్‌లో బ్లాక్ త్రిప్స్ ఉధృతితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు ఖరీదైన మందులను పిచికారీ చేస్తే తప్ప పంటను కాపాడుకోవడం కష్టంగా మారుతుంది. పంటను రక్షించుకునే క్రమంలో రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు కూలీల ఖర్చు కూడా భారీగా పెరిగింది. చెత్త తొలగింపుతో పాటు మిర్చి కాయలు తీసేందుకు కూడా భారీగా ఖర్చులు అవుతున్నాయి. గతేడాది కొందరు రైతులు మిర్చి పంటను తీసి అమ్మినా కూలీల ఖర్చులు కూడా రాక ఎదురు డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. పంటల సాగు దశలో మార్కెట్ ధరలు ఉండడం తీరా పంట చేతికందే తరుణంలో ధరలు పూర్తిగా పడిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాదైనా మిర్చి సాగు గట్టిక్కుతుందనే ఆశతో రైతులు పంటను వేసి పనులు మొదలుపెట్టారు.

మద్దతు ధర ప్రకటించాలి..



గతేడాది నాలుగు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. ఈ ఏడాది మూడెకరాల్లో మిర్చి సాగుచేస్తున్నా. ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర ప్రకటిస్తే బాగుంటుంది. సాగు ప్రారంభంలో ఉన్న రేటు పంట చేతికి వచ్చే సరిగా రేటు పూర్తిగా పడిపోతుంది. ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలి.

– తాత వేణు, రైతు, పిండిప్రోలు

సాగు విస్తీర్ణం తగ్గింది..



గతేడాది మిర్చి సాగుతో పోల్చితే ఈ ఏడాది సగానికి పైగా తగ్గింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండడంతో రైతులు మిర్చిపై విముఖత చూపుతున్నారు. ప్రారంభ దశ నుంచే యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్లు నివారించవచ్చు. అధికారుల సూచనలతోపెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలి.

– నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఓ, తిరుమలాయపాలెం

నాలుగుచోట్ల నిమజ్జన ఘాట్లు..



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఈ ఏడాది నాలుగు ప్రాంతాల్లో నిమజ్జన ఘాట్లు ఏర్పాటు చేసినట్లు మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఈ మేరకు నిమజ్జన ఘాట్లలో పనులను గురువారం మేయర్ నీరజ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భక్తుల సౌకర్యార్థం, రద్దీ, ఇతర అంశాలు దృష్టిలో పెట్టుకొని కాల్వొడ్డు (బొక్కలగడ్డ), ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి, ధంసలాపురం వద్ద మున్నేరులో పాటు గొల్లగూడెం చెరువులో ఘాట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు ఎక్కడి విగ్రహాలను అక్కడే నిమజ్జనం చేయాలని సూచించారు. కేఎంసీ ఆధ్వర్యంలో అన్ని ఘాట్‌లను ఆధునికీకరించామని, ఇటీవల వరదలతో బొక్కలగడ్డ వద్ద నిమజ్జన ఘాట్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ఈఈ కృష్ణాలాల్, డీఈఈలు ధరణికుమార్, శ్రీనివాస్, ఏఈలు ఉన్నారు.

రైతుల పక్షాన పోరాడుదాం..



మాట్లాడుతున్న హరిప్రియానాయక్

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని, రైతుల పక్షాన నిలబడి పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. గురువారం ముచ్చర్లలో పార్టీ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.. యూరియాను రాష్ట్ర ప్రభుత్వం అందించలేకపోయిందని, రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చాటాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, మూడ్ కృష్ణప్రసాద్, సామా మోహన్‌రెడ్డి, తూము బాబు, కాత్రాల రాంబాబు, మూడ్ శ్రీను, అజ్మీరా రాజు, కొనకంచి శంకర్, రాయల వెంకన్న, బానోత్ మంగూ, పుచ్చకాయల ఉదయ్‌కిరణ్, శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నానోయూరియా వాడకంతో ప్రయోజనం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రాధ

నేలకొండపల్లి: నానోయూరియా వాడటంతో రైతులకు ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ యం.రాధ సూచించారు. మండలంలోని రాజేశ్వరపురంలో గురువారం పత్తి పంటలో క్షేత్ర స్థాయిలో నానో వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో ఎరువుల వాడకంతో ఎలాంటి హానీ ఉండదని, భూములను కాపాడుకోవచ్చన్నారు. ఏఈఓ దాత్రి రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 13వ డివిజన్‌లో ఉన్న డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం, మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్టీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై నిర్వహించిన సర్వేలో పలు సమస్యలు స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారు. డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వలు పెరిగి దోమలతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. చెట్ల కొమ్మలు నరకకపోవడంతో తీగలకు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గాలి అంజయ్య, పిన్నింటి రమ్య, యలమద్ది నారాయణరావు, యలమద్ది భారతి, జట్ల ఆనందరావు, వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ మారగాని సుదర్శన్, నర్వనేని పురుషోత్తమరావు, రాజారావు, రమణ, దిరిశాల రామకష్ణ, వేదగిరి మురహరి, పెద్ది నాగయ్య, వినోద్, అనసూర్య, పద్మ పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల పంపిణీకి చర్యలు చేపట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని వక్ఫ్ భూములను పరిరక్షించి తక్షణమే పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆలిండియా ముస్లిం మైనార్టీ సంస్థ ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదిక్ అలీ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ఉర్దూఘర్ షాదీఖానాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఈ భూములు పేద ముస్లింలకు అందే విధంగా చూడాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు శాంతియుత ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మదార్ సాహెబ్, యాకుబ్ భాయ్, సుభాని, అల్లాబ, హనీఫా, నశ్రీన్, నాజ్రీన్, అస్మా, ముంతాజ్, షాహీన్, రఫీయా, మెహరాజ్, సుల్తానా ఉన్నారు.

ప్రమాద బీమా పెంపుదలపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: భవన నిర్మాణ కార్మికుల ప్రమాదబీమాను రూ.6 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడాన్ని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణాల కార్మిక సంఘం హర్షిస్తుందని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకన్న, గోసు పులయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీమా పెంచిన ప్రభుత్వం గాయపడిన కార్మికులకు రూ.1.30 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచకపోవడంపై కార్మికవర్గం అసంతృప్తిగా ఉందని, వెంటనే దీనిని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రమాద బీమాను పెంచిన సంక్షేమ బోర్డు క్లయిమ్స్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. బీమా క్లయిమ్ చేసుకునేందుకు ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ కంపెనీలకే అప్పగించాలని డిమాండ్ చేశారు.

సంచిక ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: జమాఅతె ఇస్లామీ హింద్ సెంట్రల్ మహిళా శాఖా ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త (సఅసం) జీవిత విశేషాలపై వెలువడిన గీటురాయి ప్రత్యేక సంచికను గురువారం నగరంలోని స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, మహిళా సభ్యులు షహెదా, నస్రీన్, హజిరా, సమీనా, కౌసర్, తహెసీన్, నేహ, జబీన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నుంచి రక్షించండి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని ఏ ప్రాంతంలోకి వెళ్లిన కుక్కల బెడదతో ప్రజలు బిక్కుబిక్కు మంటూ రోడ్లపై తిరిగే పరిస్థితి వచ్చిందని, వీధి కుక్కల బారి నుండి ప్రజలను కాపాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి శోభ డిమాండ్ చేశారు. గురువారం వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతూ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో కేఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, కె.శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, ధరణి, కృష్ణ, లక్ష్మీనారాయణ, అశోక్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిపై చర్య తీసుకోవాలి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో యూరియా కోసం వెళ్లిన రైతులపై దురుసుగా ప్రవర్తించిన ఎంపీఓ శివపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ వినతిపత్రం అందించారు. నాయకులు నరసింహారావు, లక్ష్మయ్య, మరికంటి రేణుబాబు, రవి, వాజీద్, కనకప్రసాద్, కాంతారావు, ప్రశాంత్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు..

రఘునాథపాలెం: జిల్లాల్లో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తీవ్ర స్థాయికి చేరాయని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని శారదా కాలేజీలో పనిచేస్తున్న బీసీ బాలుర గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులతో కూర్చుని భోజనం చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, లక్ష్మీనారాయణ, అభి, ప్రశాంత్, మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన నరేష్(26) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఆయన ఆత్మాహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి అదృశ్యం



మల్సూర్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని రాజుపేటకు చెందిన సబ్బు మల్సూర్(30) కానరాకుండా పోవడంతో కుటుంబీకులను పోలీసులను ఆశ్రయించారు. ఈనెల2వ తేదీన బయటకు వెళ్లిన ఆయన తిరిగిరాకపోగా, ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో ఆయన తండ్రి దర్గయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మల్సూర్‌కు మతిస్థిమితం సరిగా లేదని, ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్సై నాగరాజు సూచించారు.

వైద్యశిబిరం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ పరిధిలోని బాలాపేట గ్రామంలో కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ విజ్ఞప్తి మేరకు గురువారం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం రాధా, ఆశావర్కర్ సరస్వతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో గురువారం మామిళ్లగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పౌష్టికాహారం గురించి వివరించారు.

ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం

సెప్టెంబర్ 5 భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం పలు పాఠశాలల్లో ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వయంపాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి మిత్రులకు పాఠాలు బోధించారు. ఈ మేరకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు..



తిరుమలాయపాలెం: జల్లెపల్లిలో..



కూసుమంచి: కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



క్రియేటివ్ పాఠశాలలో..



ఖమ్మం సహకారనగర్: స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో..



త్రివేణి పాఠశాలలో..

పూజలు.. అన్నదానం.. నిమజ్జనం

గణేష్ నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల్లో పూజలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం కుంకుమ పూజ, దీపాలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నప్రసాద వితరణ, లడ్డూ వేలంపాట కార్యక్రమాలు చేపట్టారు. మరికొన్ని చోట్ల పూజలందుకున్న గణనాథుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఘనంగా నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



నగరంలోని గాయత్రీనగర్ గణేష్ మండపంలో దీపాలంకరణ పూజలు..



గొరిల్లా పార్క్ సమీపాన శ్రీ పవనసుత జలాంజనేయ స్వామి ఆలయంలో గణనాథుడికి 108 రకాల ప్రసాదాలు నివేదిస్తున్న అర్చకులు



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో అన్నదానం



ఖమ్మంగాంధీచౌక్: విజయ్‌నగర్ కాలనీ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో..



కూసుమంచి: గోరీలపాడుతండాలో..





ఖమ్మంఅర్బన్: 8వ డివిజన్‌లో పూజలు, 4వ డివిజన్‌లో గణనాథుడి ఊరేగింపు..



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో..